# పునర్జన్మ

జిల్లా ప్రజాపరిషత్ ఆఫీసులో 'స్పెషల్ టీచర్' ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి. ఉన్న ఉద్యోగాలు తక్కువే, అభ్యర్థులు మాత్రం ఎక్కువ. ఆఫీసు ప్రాంగణ మంతా కోలాహలంగా, 'పెద్దమనుషుల' వాహనాల రాకపోకలతో, హాజరైన అభ్యర్థుల తొక్కిసలాటతో అతి సహజంగా వుంది.

వచ్చిన అభ్యర్థుల్లో కొందరు తమకు కావలసిన 'వ్యక్తుల' రాక కోసం ఆత్రంగా ఎదురు చూస్తున్నారు. కొందరు ఆ ఉద్యోగమే తమ జీవిత పరమార్థం అన్నట్టు ఉత్కంఠగా, ఆందోళనగా మొహాలు పెట్టి వెంట తెచ్చుకున్న ఎలిమెంటరీ పుస్తకాల్ని పదే పదే తిరగేస్తున్నారు.

వాళ్ళ వాలకాన్ని గమనించిన మరి కొందరు ఆ పిచ్చివాళ్ళ అమాయకత్వానికి జాలిపడుతూ వాళ్ళ మీద జోకులేసుకుంటూ, ఆఫీసు క్యాంపస్‌లోనే సిగరెట్లు కాల్చుకుంటూ, ఈ ఇంటర్వ్యూ డ్రామాలో తమ పాత్ర ఎప్పుడు పూర్తవుతుందా, ఎప్పుడు మ్యాట్నీకి పోదామని ఎదురు చూస్తున్నారు. విజాయితీగా ఏ ఒక్కరికీ ఉద్యోగం రాదన్న సంగతి వీళ్ళకి బాగా తెలుసు. డబ్బు, రికమెండేషన్లు పెట్టుకోవాల్సిన ఖర్మ వాళ్ళకి లేదు. ఆ ఉద్యోగం లేక పోతే బతకలేమన్న భయం అంత కంటే లేదు.

భాస్కర్ ఒంటరిగా ఓ చెట్టు కింద కూర్చుని ఇంటర్వ్యూ లెటర్‌ని పరిశీలిస్తున్నాడు. డాక్టర్ ఎం. భాస్కర్, ఎం.ఎ. పిహెచ్.డి. బి.ఇడి. ఇంత చదువు చదివి చివరికి అతను స్పెషల్ టీచర్ ఉద్యోగం కోసం వచ్చాడు. ఒకప్పుడెన్నో ఆశయాలు, లక్ష్యాలు, ఉండేవి. లెక్చరర్ కావాలనీ, తన కున్న మేధా సంపత్తితో విద్యార్థుల హృదయాల్ని విజ్ఞానమయం చెయ్యాలనీ, అందరికీ మంచి చేస్తూ సమాజంలో గొప్ప వ్యక్తిగా నిలబడాలనీ... ఎన్నో తియ్యని కలలు కన్నాడు. పి.హెచ్.డి. కాగానే తాను లెక్చరర్ అయిపోతాడనుకున్నాడు. రేయింబవళ్ళు కష్టపడి చదివి పిహెచ్.డి. సంపాదించాడు. ఉద్యోగం వచ్చేంత వరకు ఆసరాగా వుంటుందని ఓ ప్రయివేటు రెసిడెన్షియల్ కాలేజీలో చేరాడు. లెక్చరర్ కావాలన్న అతని ఆశ ఈ విధంగా నెరవేరింది కాని అతని జీవితం ఆ స్థితి నుంచి బయటికి రాలేక పోయింది. ఏళ్ళు వేళ్ళు లెక్క బెట్టినట్టు గడిచి పోయాయి. ఈ లోపు అతను ఉన్న కాలేజీలో ఉండకుండా పది కాలేజీలు మారాడు.

పి.హెచ్.డి. తీసుకున్న అయిదేళ్ళకి అతనికి అనుభవ పూర్వకంగా తెలిసింది— తన కంటే చిన్న వాళ్ళు, తనకంటే చదువులో అన్ని విధాలా వెనక బడిన వాళ్లు ఎంతో మంది డిగ్రీ పూర్తి కాగానే ఏదో ఒక విధంగా బి.ఇడి.లు చేసి రెండు మూడేళ్ళలో టీచర్ ఉద్యోగాలు సంపాదించుకుంటున్నారని. భాస్కర్ కూడా కొంత మంది మిత్రుల సలహా మేరకు 'కరస్పాండెన్స్ కోర్సు'లో వేలు ఖర్చు పెట్టి బి.ఇడి పూర్తి చేశాడు. మూడేళ్ళ తర్వాత ఈ ఇంటర్వ్యూ.

డాక్టరేట్ డిగ్రీ తీసుకున్న భాస్కర్, ఈ దేశంలో సగటున వెయ్యికి ఒక్కరు కూడా చదవలేనంత పెద్ద డిగ్రీ వున్న భాస్కర్— కేవలం పదో తరగతి



పాసైతే సరిపోయే ఓ చిన్న ఉద్యోగం కోసం ఆశగా పరుగెత్తుకు రావడానికి చాలా కారణాలున్నాయి— అత నికి మరొక్క నెలలో ప్రభుత్వం ఉద్యోగార్హతకి నిర్ణయించిన గరిష్ఠ వయో పరిమితి దాటిపోతుంది. అతను ప్రస్తుతం పని చేసే ప్రయివేటు కాలేజీలో అతని జీతం వెయ్యి రూపాయలే అయినా, ఆ కాలేజీ యాజమాన్యం ఎప్పుడైనా అతన్ని బైటికి పంపించెయ్యొచ్చు. కాంపిటేటివ్ పరీక్షలు రాసి నెగ్గ గలిగే ఓపిక అతన్లో ఎప్పుడో చచ్చిపోయింది. అతనికి గవర్నమెంట్ లెక్చరర్' ఉద్యోగం రాదని తెలిసిపోయింది. ఎందుకంటే—

అతనికి తెలిసినవాళ్ళు అధికారంలో వున్నప్పుడు, అప్పటి ఇంటర్వ్యూలో 'రాజకీయం' చెయ్యకుండా నిజాయితీని నమ్ముకున్నాడు. అప్పుడు రాలేదు. అత నికి పెళ్ళయ్యింది. భార్య మరో వారంలోపు ప్రసవించవచ్చు. తన భార్యా బిడ్డలు వేళకు కడుపు నాలుగు కారపు మెతుకులు తినాలన్నా అతని కేదో ఒక స్థిరమైన ఆధారం కావాలి.

ఇన్ని అవసరాల దృష్ట్యా భాస్కర్ ఈ ఉద్యోగం కోసం వచ్చాడు. అతనికి ఈ ఉద్యోగమే ఆధారం. ఇది జారి పోయిందంటే అతని ఆశలు అడుగంటి నట్టే. ఇన్నాళ్ళూ ఏదో ఆశతో మొండిగా బతికాడు.

అతనికొచ్చే జీతం చాలకపోతే ఇన్నాళ్ళూ అతని అత్తామామలు గింజాగ్రటా పంపించి ఆదుకున్నారు, ఎప్పటికైనా అతను ఉద్యోగస్తుడు కాకపోతాడాని. ఇప్పుడిది కూడా రాకపోయిందంటే అతను, అతని భార్య, బిడ్డ....


ఇంటర్వ్యూలు ప్రారంభమైనట్టున్నాయి. అతని నెంబర్ వందలోపు. పిలుపు రావడానికి గంట పట్టచ్చు. అయినా ముందుగానే వెళ్ళి కూర్చున్నాడు. భుజాని కున్న సంచిలోంచి ఐదో తరగతి సాంఘిక శాస్త్రాన్ని బైటికి తీసి మరోసారి చదవడం మొదలుపెట్టాడు. 'డి.ఇ.ఒ. తనకు ఖచ్చితంగా ఉద్యోగమిస్తానని మాటి చ్చాడు. ఏం చేస్తాడో! ఆయనసలు ఇంటర్వ్యూలో వున్నాడో లేడో!

ఇంటర్వ్యూలో మిగిలిన వాళ్ళు ఏం ప్రశ్నలు వేస్తారో. అతని కళ్ళు పుస్తకాన్ని చదువుతుంటే,..

మనసిలా ఆలోచిస్తోంది.

"చివరికి పిహెచ్.డి. డిగ్రీ హోల్డర్లు కూడా ఇలా మనకడ్డు తగుల్తుంటే, మనలాంటి వాళ్ళకింకే మొస్తా య్రా ఉద్యోగాలు..." చెవులకి సన్నగా, స్పష్టంగా వినపించడంతో అటువైపు చూశాడు భాస్కర్.

ఎవరో వ్యక్తి కుర్రాళ్ళానే వున్నాడు. భాస్కర్ని చూసి అదో విధమైన గౌరవ భావంతో చిరునవ్వు నవ్వాడతను. కాని అతని చూపులో 'జాలి' స్పష్టంగా కనిపించింది. భాస్కర్కి, "పిచ్చి తమ్ముడూ,



ఒకరిద్దరు రచయితల్ని మాత్రమే ప్రముఖులుగా భావించి, వాళ్ల రచనల కోసమే పత్రికలు ఎదురుచూడడం పెద్ద పొరపాటు. రచయిత తన కథా వస్తువును సమాజం నుంచే స్వీకరిస్తారనే మాట నిజమైతే, అప్పుడు ఒకరిద్దరికన్నా ఎక్కువ మంది రచయితలు మరింత ఎక్కువ జీవితాన్ని చిత్రిస్తారు కదా!

—కొడవటిగంటి కుటుంబరావు

నీ వయసులో నేను ఉద్యోగం అంటే ఏమిటో కూడా ఆలోచించనంత బిజీగా ఉండేవాణ్ణి. అందుకే.. చివరికి మీకు పోటీ రావలసి వస్తోంది..." అని చెప్పాలనుకున్నాడు. కాని.....

ఉద్యోగం రాకుండా పెళ్ళే చేసుకోనని భీష్మిం చిన భాస్కర్ అమ్మానాన్నల పోరు పడలేక తల వంచాడు. ఎలాంటి అడ్డదార్లూ తొక్కకుండా నిజా యితీగా ఉద్యోగం సంపాదించాలనుకున్నాడు.

అలా అనుకునే రెండు సార్లు లెక్చరర్ ఉద్యో గాల ఇంటర్వ్యూకి వెళ్ళి, తిరుగుమొహం పట్టాడు. ఉద్యోగం రాందే పిల్లల్ని కనగూడదని నిశ్చయించు కున్నాడు. కాని పరిస్థితులకి లొంగి పోయాడు. ఇప్పుడు కూడా నిజాయితీగా, మెరిట్‌తో ఉద్యోగం సంపాదించాలనుకున్న తన దృఢాభిప్రాయాన్ని భార్యా పిల్లల కోసం మార్చుకున్నాడు. తన మామగారి స్నేహితుడు, తమ 'కులస్తుడు' అయిన ఆ జిల్లా విద్యాధికారిని ఈ ఉద్యోగం కోసం పట్టుకున్నాడు. రోజుకి పదిసార్లు అతని చుట్టూ తిరిగాడు— ఉద్యో గానికి బేరం పదివేలకి కుదుర్చుకుని, ముందుగానే చెల్లించాడు.

ఇంత కష్టపడి సంపాదించే ఆ ఉద్యోగం వల్ల వచ్చే జీతం నెలకు దాదాపు నాలుగొందల రూపాయలు. ఆ జీతంతో, ఎలాంటి సౌకర్యాలూ వుండని ఓ కుగ్రా మంలో పనిచెయ్యాలి. అలా ఒకటి రెండేళ్ళు పని చేస్తే, అప్పుడు ప్రభుత్వం అతని సేవల్ని గుర్తించి ఆ ఉద్యోగాన్ని పర్మినెంటు చేయవచ్చు. అప్పుడు జీతం దగ్గర దగ్గర పన్నెండొందలు రావచ్చు. ఇలాంటి ఉద్యోగం కోసం ఇంత కష్టపడాలా, బ్యాంకులో లోను తీసుకుని స్వతంత్రంగా ఏదో ఒక వ్యాపారం పెట్టుకు

నైనా బతకొచ్చుకదా... అనుకుంటే— భాస్కర్‌కి తాను లెక్చరర్ లేదా టీచర్ పని తప్ప ఈ ప్రపం చంలో ఇంకేదీ చెయ్యలేడని గొప్పనమ్మకం. అందు వల్ల అతను గవర్నమెంటు ఉద్యోగం తప్ప ఇంకేదీ చెయ్యదల్చుకోలేదు. అందుకే ఇన్నిపాట్లు.

ఇంటర్వ్యూకి భాస్కర్ వంతొచ్చింది. మొహంలో టెన్షన్, నడకలో తడబాటు చూపిస్తూ హాల్లో దూరాడు. లోపలికి వెళ్ళడంతోనే అతని కళ్ళు డి.ఇ.ఓ కోసం వెతికాయి. నలుగురు ఇంటర్వ్యూ బోర్డు సభ్యుల్లో ప్రత్యేకంగా కనిపిస్తూ, తలవంచుకుని అప్లి కేషన్లని వెరిఫై చేస్తున్నాడాయన.

"నమస్తేసార్" బలవంతపు నవ్వుని మొహానికి పూసుకుంటూ అందర్నీ విష్ చేశాడు భాస్కర్.

మిగతా ముగ్గురు తలవూపి కూర్చోమన్నట్టు సైగ చేశారు.

"థాంక్యూ" వినిపించకుండా అనేసి కూర్చు న్నాడు.

"యు ఆర్ మిస్ట...ర్ ర్... భాస్కర్?" డిఇఓ అన్నాడు తలెత్తకుండానే

"యస్సర్"

"మీరు డాక్టరేట్ కూడా చేశారు కదూ!" ఆయనే అడిగాడు తలెత్తిచూస్తూ.

"ఔన్సార్..." గుండెల్లో గుర్రాలు బయల్దేరాయి భాస్కర్‌కి, "రాత్రే తనతో చెప్పాడు డిఇఓ - 'నేనేం ప్రశ్నలడగను, మిగతా వాళ్ళు అడుగుతారు. జాగ్రత్తగా ఆలోచించి సమాధానం చెప్పు' అని మరి ఇప్పుడేమిటి.

"పి.హెచ్.డి అయ్యాక బి.ఇడి చెయ్యడానిక్కార ణం?" వేరే ఆయన అడిగాడు. ఏం చెప్పాలో వెంటనే తోచలేదు భాస్కర్‌కి "అదీ... అదీ... బి.ఇడి చేస్తే ఉద్యోగాలు త్వరగా వస్తాయని..." నోరు జారాడు.

"అదేంటండీ అలా అంటారు? దేశంలో బి.ఇడి చేసే వాళ్ళు లక్షల మంది వున్నారు. పి.హెచ్.డి చేసే వాళ్ళువందల్లో వున్నారు. అలాంటప్పుడు పెద్ద డిగ్రీకి కదా తొందరగా ఉద్యోగం రావలసింది?"

"రావాలి సార్! కాని వున్న లెక్చరర్ పోస్టుల్ని గవర్నమెంట్ భర్తీ చేస్తేగా?" చెప్పడం పూర్తి అవుతూనే కళ్ళు బైర్లు కమ్మాయి భాస్కర్‌కి. రెండో ప్రశ్నకు కూడా ప్రభుత్వాన్ని విమర్శించినట్టు జవాబు చెప్పాడతను. 'వాళ్ళడిగే ప్రశ్నలకు జాగ్రత్తగా సమాధానం చెప్పు' అన్న డి.ఇ.ఓ. సూచన చెవుల్లో గింగురుమంది. తన తొందరపాటుకు తిట్టుకున్నాడు.

"మరైతే ప్రభుత్వం లెక్చరర్ పోస్టుల్ని భర్తీ చేసేంతవరకు ఆగితే మీరు లెక్చరర్ అయిపోవచ్చు కదా! అలాంటప్పుడు తొందరపడి ఈ చిన్న ఉద్యో గానికి రావడమెందుకు? ఒక వేళ మేము మీకీ ఉద్యోగమిచ్చినా మీరు శాశ్వతంగా ఇందులోనే వుంటారని నమ్మకమేముంది? రేపు లెక్చరర్ పోస్టు వస్తే దానికి మీరు వెళ్ళిపోతే?..." నుదరు చెమటలా

కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

కాలి మొహమంతా అలుక్కుపోయినట్టయింది భాస్కర్‌కి. "నేనీ ఉద్యోగాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదలను. అలాగని బాండ్ రాసిస్తాను. ఈ ఉద్యోగం రాకపోతే నాకు ఆత్మహత్యేగతి... దయ చేసి నా కుద్యోగం ఇప్పించండి" అని దీనంగా కాళ్ళు పట్టుకోవాలనిపించింది. అంతలోనే తట్టింది సమాధానం "నిజమేసార్! కాని మరో నెల తర్వాత నేను ఏ ప్రభుత్వోద్యోగానికీ పనికి రాను. ఈ నెల రోజుల్లో లెక్చరర్ పోస్టులు పడతాయా?" ఇక నేను ఈ ఉద్యోగాన్ని వదిలే సమస్య ఏముంది సార్!" ఈ ఒక్క సమాధానానికి తనను తాను అభినందించు కున్నాడు. "యుఆర్ రైట్... ఒకే! థాంక్యూ మిస్టర్ భాస్కర్! యు కెన్‌గో" డి.ఇ.ఓ వేరే అప్లికేషన్ తీస్తూ అన్నాడు.

బయటికొస్తూ అనుకున్నాడు భాస్కర్ - 'అడిగే వాడికి చెప్పేవాడు లోకువ' కాదు "పిల్లికి చెలగాటం - ఎలుకకి ప్రాణ సంకటం"

* * *

"... ... డెలివరీ ఇంకా రెండు మూడు రోజుల్లో రావచ్చునని డాక్టర్ చెప్పింది. నా దగ్గర మీరు లేక పోతే నాకు దిగులుగా వుంటుంది. ఈ ఉత్తరం అందిన వెంటనే మీరు బయల్దేరి రండి. బహుశా ఇంటర్వ్యూ అయి పోయి వుంటుందనుకుంటాన్నను. మీ మెరిట్‌తో కాకపోయినా, 'వేరే' విధంగానైనా మీకు ఉద్యోగం వస్తుందని నమ్ముతున్నాను. అమ్మా నాన్నలు మిమ్మల్ని వెంటనే బయల్దేరి రమ్మన్నారు. మీరు వచ్చేంతవరకు నాకు భయంగానే వుంటుంది. నాకు పునర్జన్మ లాంటి ఈ ప్రసవం అయిపోయి, నేను కళ్ళు తెరవడం తోటే ముందుగా మిమ్మల్నే చూడాలి. వెంటనే బయల్దేరి వస్తారు కదూ! ఎదురు చూస్తువుంటాను.

మీ

శ్యామల

ఉత్తరాన్ని మడిచి జేబులో పెట్టుకుని గబ గబా బట్టలు బ్యాగ్‌లో సర్దుకున్నాడు భాస్కర్. జీవితంలో అతనికి ఎలాంటి రాజకీయాలు, లంచాలు, పలుకు బళ్ళూ లేకుండా దొరికిన ఒకే ఒక స్నేహితురాలు అతని భార్య. ఆమె ఇచ్చే ధైర్యం, ప్రోత్సాహం అతనికి భవిష్యత్తు మీద ఆశలు పుట్టిస్తుంది.

భోజనం కూడా చెయ్యకుండా తెలిసిన మిత్రుడొకడికి ఇంటర్వ్యూ రిజల్టు తెలియగానే టెలిగ్రాం ఇవ్వమని చెప్పి బస్సెక్కాడు. సాయంత్రానికి వూరు చేరి, ఆశగా ఎదురు చూస్తున్న భార్య కళ్ళలో వెలిగిన ఆనందపుకాంతుల్ని చూసి సంతృప్తి పడ్డాడు. అత్తమామలు, బావమరుదులు తనపట్ల చూపించే 'మర్యాద' ఇంకా పూర్తిగా తగ్గనందుకు పెద్దగా బాధపడలేదు. బహుశా తనకు ఉద్యోగం రాకపోతే ఆ కాస్త మర్యాద కూడా వుండదేమో అనుకున్నాడు.

రెండ్రోజుల తర్వాత అర్ధరాత్రి పూట శ్యామలకు నొప్పులు ప్రారంభమయ్యాయి. అంతా కంగారుగా లేచి వెంటనే హాస్పిటల్‌లో చేర్పించారు. డాక్టర్ మందులు రాసి ఇస్తోంది... మామయ్య డబ్బులిస్తున్నాడు. ఆయన జేబులోంచి ఒక్కొక్క రూపాయి బయటికొస్తుంటే భాస్కర్ మనసు సిగ్గుతో చితికిపోతోంది - తన డబ్బుతో తన భార్యకు మందులు కూడా ఇప్పించలేని దుస్థితిలో వున్నందుకు. అయినా తప్పదు. తన భార్యకు ఏమీ కాకూడదు. అర్ధరాత్రి బజార్లలో పడి మందుల కోసం తిరుగుతున్నాడు భాస్కర్. అత్తయ్య ఏడుస్తుంటే ఓదార్చడానికి మామయ్య వున్నాడు. నచ్చజెప్పడానికి డాక్టర్లు, నర్సులు వున్నారు. మామయ్య డాక్టర్‌నే నిలదీసి 'జాగర్తగా చెయ్' అనే స్థితిలో వున్నాడు. కాని తన బాధ, దిగులు ఎవరికి చెప్పుకోవాలి? ఏవేవో పిచ్చిపిచ్చి ఆలోచనలు. తన భార్యకేదైనా అయితే? అంతమంచి స్నేహితురాలు దూరమైతే? బిడ్డని కనడానికి ఆడదానికి ఇంత ప్రాణ సంకటం ఎందుకు? కాన్పు చచ్చి బతకడమని తెలిసి కూడా ఆడవాళ్లెందుకు ఇంత సాహసం చేస్తారు? ఇలాంటి పరిస్థితే మగవాళ్ళకుంటే? ఎట్టి పరిస్థితుల్లోను బిడ్డల్ని కనరు. తన భార్యని రక్షించే దెవరు? జీవితంలో 'దేవుడు' అనే వాణ్ణి నమ్మని భాస్కర్ ఆ క్షణంలో తన భార్యని రక్షించమని ప్రార్థించాడు. ఎదురుగా తెల్లని బట్టల్లో ప్రత్యక్ష దేవతలా వస్తున్న డాక్టర్ దగ్గరకెళ్ళి దీనంగా అన్నాడు "ప్లీజ్ సేవ్‌మై వైఫ్" ఆమె అతని వైపు చూడను కూడా చూడలేదు.

రాత్రంతా డాక్టరు, నర్సులు నానా కష్టాలు పడి అడ్డం తిరిగిన బిడ్డని సరిగా చెయ్యగలిగారు. ఉదయం ఎనిమిది గంటలకల్లా గండం గడిచి పిండం బయటపడింది. శుక్రవారం... ఆడపిల్ల.

డాక్టర్ చెప్పిన వార్త విని పరిగెత్తుకుంటూ వచ్చాడు భాస్కర్. అత్తయ్య ముందుగా తన భర్తకు చెప్పింది "ఆడపిల్ల... ఇద్దరూ క్షేమం" అని. పక్కనే భాస్కర్ వున్నాడు కాబట్టి మళ్ళీ అతనికి చెప్పలేదు.

"పోన్లేవే! బిడ్డ... రాత్రంతా చావుతో పోరాడింది... అందుకే అంటారు ఆడదానికి ప్రసవం పునర్జన్మ అని..." నిట్టూరుస్తూ అన్నాడాయన.

భాస్కర్ అబ్బాయి కావాలనుకున్నాడు. అమ్మాయి కాబట్టే ... సరిపెట్టుకుంటాడు.

"శుక్రవారంనాడు లక్ష్మీదేవి పుట్టిందయ్యా! ఇక నీ రోజులే మారిపోతాయి చూడు..." అత్తయ్య మాటల్లో 'మనవడు పుట్టలేదన్న బాధ' స్పష్టంగా కనిపించింది భాస్కర్‌కి.

"వెళ్ళి చూడొచ్చా?" భాస్కర్ మనసంతా తన భార్యపైనే వుంది.

"ఊ... పదండి..."

"బావా! బావా!... నీకేదో టెలిగ్రాం వచ్చింది..." గిరుక్కున వెనక్కి తిరిగాడు భాస్కర్- శ్యామల చిన్న తమ్ముడు పరిగెత్తుకుంటూ వచ్చి చెప్పడంతో!

"ఏదీ టెలిగ్రాం?" ఆదుర్దాగా అడిగాడు.

"అన్నయ్య తెస్తున్నాడు" రొప్పుతూ చెప్పాడతడు.

గబగబా బయటికి పరిగెత్తాడు భాస్కర్. ఎదురొచ్చాడు పెద్ద బావమరిది. అతని చేతిలో వున్న టెలిగ్రాంని లాక్కుని చూశాడు. అతని గుండెలు భవిష్యత్‌కు సంబంధించిన భయంతో గడగడలాడుతున్నాయి.

"యు ఆర్ సెలెక్టెడ్... కంగ్రాచ్యులేషన్స్" సంతోషంతో గుండెలు చల్లబడ్డాయి భాస్కర్‌కి. ఎదురుగా వచ్చిన అత్తమామలకి వార్త చెప్పాడు.


"నే చెప్పలా? శుక్రవారం పూట లక్ష్మీదేవి పుట్టింది, నీకుద్యోగమొచ్చింది. ఇదేముంది? ఇంకో నాలుగైదేళ్ళలో నీ జాతకమే మారిపోతుంది. నాకు తెలుసు... నా మనవరాలు మహర్జాతకురాలు..."

అత్తయ్య మాటలు భాస్కర్‌కి వినిపించట్లేదు. నెమ్మదిగా శ్యామల దగ్గరికి కదిలాడు 'శ్యామల కళ్ళు తెరవగానే చెప్పాలి - నీతో బాటు నేను కూడా పునర్జన్మించానని' అనుకుంటూ!

('పునర్జన్మ' పొందిన 'రమణ్ జీ'కి, అలాంటి ఎంతోమంది మిత్రులకీ...)



"ఏమండీ వంటింట్లో ఏదో చప్పుడవుతోంది" అర్ధరాత్రి భర్తని లేపింది భార్య.
"ఏ పిల్లో అయ్యుంటుంది పడుకో". చెప్పాడు భర్త.
"పిల్లిని కాదు ఎలకని" వినిపించింది కంఠం వంటింట్లోంచి.
"అదిగో నే చెప్పలా ఎలుకట పడుకో" అటు తిరిగి పడుకున్నాడు భర్త.



"కిందటాదివారం కూరగాయల కెళ్లిన మా వారు ఇప్పటి వరకు రాలేదు పిన్నిగారు" ఆందోళనగా చెప్పింది రాధ పక్కింటావిడకి.
"మరేం ఫర్లేదులే అమ్మా, మా ఫ్రిజ్ నిండా కూరగాయలున్నాయి తీసుకెళ్లు" చెప్పిందావిడ.